

# టేకిట్ ఈజీ!! - 2

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



## గర్జించని నలభైలు (తొలి భాగం )

**చిన్నప్పుడెప్పుడో** సాంఘిక శాస్త్ర పుస్తకంలో చదువుకున్న గుర్తు. గర్జించే నలభైలనీ, తరువాతి పాఠంలో టండ్రాలనీ, ప్రయరీలూ, స్టెప్పీలనీని. అసలా పేరెట్టిన వాడికి వేపకాయంత వెట్టి ఉందేమో అని నాకనుమానం. ఎవడన్నా బెమ్మచారిగా ఉన్నప్పుడో, పెళ్ళైన కొత్తలోనో గర్జిస్తాడు గానీ, నలభైల్లో గర్జింటడవేవిటండీ, వాడి బూడిద. నలభైల్లో అంతా గాంధీగారు చెప్పినట్టు సింపుల్ లివింగూ హై థింకింగూను. అంటే మనది సింపుల్ లివింగు, ఆవిడిది హై థింకింగూనన్నమాట. పిల్లలది కాస్ట్లీ లివింగూ, బ్రాండ్నేం థింకింగూను. అయినా ఇప్పుడు వాళ్ళ గొడవెందుకులెండి, స్కూలుకి పోయారు. చెప్పొచ్చేదేవిటంటే, ఆమధ్యన అయాంబాబు గారికి నలభై వచ్చింది. ఆ సందర్భంగా జరిగిన ప్రహసనాన్ని మరొక్కమారు గుర్తుకు తెచ్చుకుందామనిపించింది.

రెండువారాల ముందే, దరిదాపుల్లో యే వీకెండు పార్టీలూ, పెళ్ళిళ్ళూ లేకుండానే, మా ఆవిడ గోళ్ళు, కాళ్ళు, వేళ్ళు, జుట్టు, ఇల్లా పార్ట్స్, పార్ట్స్ గా కండిషనింగులు చేయించుకుని అన్ని రకాల దిక్కుమాలిన **"క్యూర్"** లకి వెళ్ళి వచ్చింది. ***"ఎందుకే ఇలా డబ్బులు తగలేస్తావు, హాయిగా నేను గెడ్డం గోక్కునే బ్లేడుతో ఫ్రీ గా చేసిపెడతానే"*** అన్నాను.

***"ఆ, చేస్తారు, నెల్కకితం, వద్దుమొర్రో అంటుంటే, ఐబోస్ చేస్తా, ఐబోస్ చేస్తా అని ప్రాణం తీసేసారు. చివరికి ఒక ఐబో మొత్తం గోకేసారు. చఛ్ఛాను ఏకాక్షిలా తిరగలేక. బాల్చీలో వేణ్ణీళ్ళోసి, దాన్లోకాస్త అమృతాంజనం వేసేసి, కాళ్ళెట్టు, కాళ్ళెట్టు, పెడిక్యూరు అని ఒకటే గోల. ఛస్తున్నాను, మీ కక్కుర్తితో. "*** అనేసి మేడపైకెళ్ళిపోయింది.

నిర్లిప్తంగా ఓ చూపు చూసి, మళ్ళీ టీవీలో పడ్డాను.

ఆ ఆదివారం చేసేందుకేమీ లేక, పనిలేని శీనిగాడు మంగలాడిదగ్గరకెళ్ళుటకై, చెప్పులకి కాళ్ళు తొడిగి, ఐ మీన్, కాళ్ళకి చెప్పులు తొడిగి, బయల్దేరుతూంటే, వెనక్కి పిలిచింది. ***" ఎందుకండీ, బెమ్మాణ్ణంగా ఉంది మీ హెయిర్ స్టయిలు, చక్కగా, తబలా వాయించేవాడిలా, చెవులు కనబడకండా జుట్టూ మీరూను, ఇలా ఎంతమందికుంటుంది చెప్పండి?"*** అంటూ ఆపేసింది. నాకేం తెలుసూ? కామోసనుకున్నాను. విషయం ఏవిటంటే, పార్టీ రోజున తీసిన ఫొటోల్లో, ఆవిడకి దిష్టి తగలకుండా, పక్కన నా ఇమేజి ఉంటే, ఆవిడ ఏజి కనబడదట. ఇంత కుట్ర జరుగుతోందని తెలుసుకోడానికి నేనేవన్నా బెమ్మనాయుణ్ణా ?

సరే, రాత్రి నేను పడుకున్నాకా, మా ఆవిడ ఫోనులో గుసగుసలు మొదలెట్టింది. ఆవిడ పాతివ్రత్యాన్ని శంకించలేదుగానీ, ఈ దిక్కుమాలిన ఫేస్‌బుక్ వచ్చాకా ఫోనుకాళ్ళు తగ్గిపోయాయికదా, ఇదేవిటబ్బా, కొత్తగా, అని కించిత్తు సందేహపడ్డాను. అయినా మనకెందుకులే, లేడీసన్నాకా లక్షుంటాయి, అనుకుని వదిలేహాను. ఆనక ఓరోజు ఆఫీసులో ఉండగా, క్రెడిట్ కార్డు కంపెనీ వాళ్ళ దగ్గర్నించి కాలొచ్చింది, *మీ కార్డుమీద ఒక పేద్ద ఛార్జి చెయ్యబడినది, చూసుకోండి, లేపోతే కరుసైపోతారు,* అని. వెంఠనే అనుమానవొచ్చి మా ఆవిడకి ఫోను చేసాను. కంగారడిపోయింది. చివరికి చెప్పింది ***" పాపవండీ. మన పక్కింటి టోనీ గాడి రెండో కుక్కకి మెడలో బంగారం గొలుసు చేయిస్తానని మొక్కుకున్నానండీ, మన వెధవ కిండర్ గార్టెన్ పాసయితే. వాడు పాసయిపోయి రెండు నెలలైంది కదా, అందుకేమాట, కొన్నాను.."*** అంది గారాలుపోతూ.

నేను రియాక్టయ్యే లోపున ఠక్కుమని ఫోనుపెట్టేసింది. ఆ తరవాత నాకు రియాక్టయ్యే ఓపికలేక, అలాగే ఆఫీసు కుర్చీలో కూర్చుని, దాన్ని కాలితో తిప్పుతూ, "ఒహటీ, రెండూ, మూడూ.. " అంటూ చుట్లు లెఖ్ఖెడుతూ కళ్ళు మూసుకున్నాను. కాసేపటికి కళ్ళు తిరిగాయి. నెత్తిమీద శింశుపా వృక్షమేమీ కనపడలేదు గానీ, మా ఆఫీసు అచ్చం అశోకవనంలాగే తోచింది నాకప్పుడు.

ఆరోజు సాయంత్రం గరాజులో ఫ్రిజ్జి తీసి చూసా. దాన్నిండా, ప్రపంచంలో పండే అన్ని ఫలాలూ, కూరగాయలూ కనిపించాయి. రెండు టొమాటోలు కిందపడి దొర్లుకుంటూ నాకారు టైరు కిందకి వెళ్ళిపోయాయి. తీసే ఓపికలేక, వాటిని అల్లాగే ఉణ్ణిచేసాను. లోపలికొచ్చి అడిగాను

***" ఏమే, ఏవన్నా కిరాణా కొట్టు పెడుతున్నావా"?*** అని.

***"అవును, అదొక్కటే తరువాయి, మన సంపాదనకి"*** అంది నవ్వుతూ.

***"మరెందుకే అన్ని కొనేసావు "*** అన్నాను ఆందోళనగా.

***"ఏంలేదండీ, డాక్టరు హెల్దీ ఫుడ్డు తినమన్నాడు కదా, అవీ ఆర్గానిక్కువి. అంచేత, ఆఫీసు నించి వచ్చేప్పుడు అలా వెళ్ళి, పట్టుకొచ్చానన్నమాట"*** అంది.

నా గుండె రెండు సెకన్లు మౌనం పాటించి, ఆనక అడ్డదిడ్డంగా కొట్టుకోడం మొదలెట్టింది. నాకు తెలిసి, ఫ్రిజ్జుడు ఆర్గానిక్కు కూరగాయలు, పళ్ళు కొనాలంటే, అది ఫ్రిజ్జు ఖరీదు కన్నా ఎక్కువౌతుంది. అసలా డబ్బులతో రెండు ఫ్రిజ్జులు కొనుక్కోవచ్చు. ***"ఓరి దేవుడోయ్,, కొంప గుల్లే...."*** అనుకుని, మరో నిర్లిప్తమైన చూపు, పేలవమైన నవ్వుతో సరిపెట్టా.

మొత్తానికి నా పుట్టినరోజు శనివారం రానే వచ్చింది. ఆ రోజు పెందలకడనే లేచి, స్నానం గట్రా కానిచ్చి, ఎందుకేనా మంచిదని, మాయింట్లో దేవుడి గది ఎక్కడుందో వెతుక్కుని మరీ వెళ్ళాను లోపలికి. ఓ అగరొత్తి వెలిగించి, ఏదన్నా చదువుదామంటే, మనం మంత్రాల్లో వీకు కాబట్టి, ఉభయతారకంగా ఉంటుందని హనుమాన్ చాలీసా మొదలెట్టా. మాసప్పీల్ కోసం సిక్స్ ట్రాక్ స్టీరియో ఫోనిక్ సౌండులో. వెంఠనే మా ఆవిడొచ్చి ఆపేసింది, ***పిల్లలు భయపడతారండీ,*** అంటూ ప్రాధేయ పడుతూ. ఎవడన్నా భయం పోవడానికి చదువుతాడు హనుమాన్ చాలీసా. ఏంచేస్తాం, ఆపేసాను, వాళ్ళ భయం పోగొట్టడానికి.

ఆమట్నించి బైటకొచ్చి చూతునా, డైనింగ్ టేబుల్ మీద ఉప్మా రెడీగా ఉంది జీడిపప్పులతో సహా.

పక్కనే పల్లీ పచ్చడి. తస్సాదియ్యా, కుమ్మేసాను. అప్పుడొచ్చింది ఫోను. మా ఫ్రెండు ఒకాయన. ***"ఆమధ్యనేదో షార్ట్ ఫిల్మ్ తీస్తానన్నావు, దాని బడ్జెట్ గురించి మాట్లాడదాం వస్తావా"*** అన్నారు.

మరిదే, వీక్ నెస్ మీద కొట్టడవంటే. ధర్మరాజుని దుర్యోధనుడు జూదానికి పిలిస్తే, ***" బెదరూ, ఈ పాలికి ఒదిలేయ్, నెక్స్ట్ వీక్ సూద్దారి"*** అనొచ్చేమో గానీ, నన్నెవరేనా సినిమాలగురించి మాట్లాడుకుందాం రమ్మంటే, వాళ్ళు ఫోను పెట్టేసేలోపు వాళ్ళ గుమ్మంలో వాలిపోతాను. కితం జెన్మలో కెమేరానేమో!

అంచేత ***"వస్తున్నా"*** అనేసా.

***"తొందర లేదు, లంచ్ చేసేసి రా, కాస్త ఎక్కువసేపు కూర్చుందాం"*** అన్నారాయన.

***"అబ్బే, లంచ్ భయం లేదండి, ఇప్పుడే ఉప్మా తిన్నాను, మళ్ళీ మూడురోజులదాకా అరగదు, వచ్చేస్తున్నా"*** అనేసి, ఫోను పక్కన పడేసి, కారెక్కేసి, ఆరో నిముషంలో వాళ్ళింట్లో వాలిపోయా..

(ఇంకా వుంది)

## (వచ్చే సంచిక దాకా లైట్ తీస్కోండి!)

POST YOUR COMMENTS